# స్త్రీ అంటే ఎవరు?

★

శ్రీమతి ఎమ్. సుశీలాదేవి

"ఏయి. మిమ్మల్నే. అబ్బబ్బ. ఏంనిద్రండి. లేవండి."

"ఏమిటే శనిముండల్లా చంపుకు తింటున్నావు. ఇప్పటికి మూడురాత్రిళ్ళనించి నిద్రలేక వెధవరైలు ప్రయాణాల్లో. కాస్త కునుకుపడుతోంది అనుకునేటప్పటికి నువ్వు. తలగడా పుచ్చుకు డాబామీదికి పొమ్మంటావా? నోరుమూసుక్కు పడుకుంటావా ..."

"మీరు నన్ను చూచేసరికల్లా కస్సు, బుస్సు మంటూనే ఉంటారు. నేనేంపాపం చేసానండి."

"నువ్వేం పాపం చేసావో నాకు తెలియదుకాని నాకు కోపం తెప్పించకు."

"కారణంలేనిదే, ఏతప్పుచెయ్యనిదే ఆడవాళ్ళపై అక్రమంగా కోపంతెచ్చుకోవటం మగవాళ్ళ సహజ లక్షణమా?"

"అబ్బ, ఒక్క క్షణం నిద్రపోదామని పక్కవేస్తే ఈ మూడురోజులనించి నిద్రలేని బడలిక తీరుతుందనుకున్నాను. నీకళ్ళు చల్లబడ్డాయా. ఇదుగో లేచికూర్చున్నా."

"మిమ్మల్ని నిద్రలేనప్పుడు లేపికూర్చోపెట్టి బాధిద్దామనికాదు. మానాన్న మిమ్మల్ని ఒక సైకిలు కొనుక్కోమని మూడువందల రూపాయలు మనియార్డరు పంపాడు. సంతోషవార్త. బాగుందా?"

"గొప్పపని చేసాడులే. వాచీ రెండువందలు ఎగగొట్టి సైకిలుకు మూడువందలు పంపితే నిన్ను పంపిస్తానని ఆ ముండాకొడుకు ఆశ. ఈపట్టు వాచీకి ఇంకోరెండువందలు బిల్లుచేసి నాల్గువందలు పంపితేనేగాని ఉత్తరం ముక్కకేనా ఆశ వదులుకోవల్సిందేనని చెప్పు. ఆ మూడువందలుఎవ్వి ఇల్లాపారెయ్యి."

"ఇస్తే నాకేం చేయించుకొస్తారేమిటి?"

"నెక్లెస్ పట్టుకొస్తా."

"అయితే ఇవిగో మూడువందలు."

"అయితే నేవచ్చేప్పుడు కొనుక్కొచ్చిన కొత్తసూటుకేసులో అట్టపెట్లో నెక్లెను తెచ్చుకో."

"నిజంగా తెచ్చారాండీ. నాకేనా?"

"నీకు కాదు. అది ఎవరికో యింకోరికి. తెల్లారేదాకా అది పెట్టుకుంటే తెల్లారాక యింకోటి తెస్తా."

"ఎవరికోసమో తెచ్చిన నెక్లెసు నాకెందుకు, ఛీ! ఏపాడుముండకోసం తెచ్చారో. అది ఆ పెట్లోంచి తీసిపారెయ్యండి."

"నువ్వే ఆ పాడుముండవి. నీకోసమే అది."

"నాకోసమే అయితే అన్ని అబద్ధాలెందుకండి?"

"ఆ నెక్లెసు పెట్టుకుని శుభ్రంగా నిద్రపో. ఏం బాగుందా.
నువ్వు పెట్టుకుంటే బాగుగానే ఉంటుందికదూ. ఇంక నిద్రపో."

"నన్ను పడుకో పడుకో అని అల్లా పదేపదే చెప్తారేమిటండి. నాకు నిద్రవచ్చేదాకా ఈ నెక్లెసు మెళ్ళో పెట్టుకుంటే ఎంత అందంగా ఉంటుందో పెద్ద అద్దంలో చూస్తూ నుంచుంటా."

"పోనీ ఆ పెద్ద అద్దం దగ్గిరకిపోయి అల్లాగే నిలబడిచూడు."

"నన్ను ఏదో విధంగా అవతల్కి తోలేసి నిద్రపోదామని. ఏమండీ, మీకు యిందాకా నామీద అంతకోపం వచ్చిందికదా, మీకు సమస్త సేవలు చేస్తున్నా. మీకు యిక్కడకాలు అక్కడ పెట్టకుండా అన్నీ అందించి కాళ్ళుపిసుకుతూ ఎన్నెన్నో చేస్తున్నా. యిన్ని సేవలు ఎందుకు చేస్తున్నానండి?"

"చంచల హృదయుడు అస్థిర చిత్తుడయిన మగవానిని తనవైపు లాక్కుని ఎల్లప్పుడు అతనిదృష్టి మరొకదెసకు పోకుండా ఉంటానిక్కి."

"ఏమండీ ... స్త్రీ ఒక బానిసా లేక యంత్రమా లేక వ్యక్తిత్వంలేని మట్టిబొమ్మా మీదృష్టిలో? స్థిరమయిన అనురాగాన్ని కలగచేసుకోటానికంటూ మేము యిన్నిసేవలు మగాళ్ళకు చేయవల్సివస్తే మగవాళ్ళు మాఅనురాగాన్ని చూరగొంటానిక్కి మాబట్టలు, జాకెట్లు, బాడీలు ఉతుకుతున్నారా?"

"లేదు."

"లేనిదానిక్కి మేమెందుకు మీకు అనురాగంపేరిట సేవలు చెయ్యాలి. యిల్లా ఎంతకాలంచెయ్యాలి?"

"ఎంతకాలమేనా చెయ్యాలి."

"అబ్బా, అల్లాకాదు. చెప్పండీ."

"అయితేవిను. ఆడవాళ్ళలో కట్టుబాటువచ్చి వ్యభిచారిణులసంఖ్య శూన్యమయి, అందరూ పతివ్రతలయిననాడు ఎవరిమొగుళ్ళు వాళ్ళకి చచ్చినట్టు లొంగుతారు. ఇక ఎక్కడిక్కి ఎగేసుక్కి పోవటానిక్కి సావకాశం ఉండదు. అట్లాజరగటం అనేదేఉంటే ప్రపంచంలో ధర్మం నాల్గుపాదాలా నడుస్తుంది. పరస్త్రీ అంటే మర్యాద, గౌరవం ప్రజలలోకల్గి అత్యాచారాల్కి, దుర్మార్గాల్కి తావుఉండదు. దీనినే రాముడు ఆచరించిన ఏకపత్నీవ్రతం అనికూడా అనవచ్చు. ఇకపోతే సుఖరోగుల మరణసంఖ్య క్రమక్రమంగా క్షీణించి అంటురోగాలు అంతర్ధానమవుతాయి. ప్రతీచోటా దేశంలో శాంతి భద్రతలు ఏర్పడి రాజ్యంలో అరాచకాలుపోయి సుభిక్షంగా ఉంటుంది. మనువర్తిదావాలు అసలే మటుమాయమయి కోర్టుకురాబడి తగ్గినప్పటికి, ప్రభుత్వం ఈ ద్రవ్యాన్ని మరోవిధంగాకూడ తీసుకుంటుంది. అంచేత యీకట్టుబాటు ఆడవాళ్ళలోకల్గాలి."

"ఏమండీ, ఈ కట్టుబాటు మగవాళ్ళలోనే కలిగి వారే వ్యభిచారిణుల యిళ్ళకు పోకుండాఉంటే. ఏం. ఆడవాళ్ళే కట్టుకట్టాలా?"

"అవును. రేపు మీ నారీస్థానీపార్టీ అధికారంలోకివచ్చాక మగవారంతా వంటలుచేస్తారు. పిల్లకాయల్ని ఆడిస్తారు. ఒక్కపిల్లల్ని కనటంతప్ప మిగతాయావత్తు ఆడవాళ్ళు యిప్పుడుచేసేపనులు అన్నీకూడా అప్పుడు మేంచెయ్యవల్సి వస్తుంది. దేశంలో నాయకులు అంతా ఆలోచించి నెమ్మదిగా మిమ్మల్ని ఉద్ధరించటానిక్కి ప్రయత్నిస్తున్నారు. అప్పుడు మగవాళ్ళను కట్టుకడతాము. యిప్పుడు మీరే కట్టుకట్టాలి."

"ఏమండీ మీరు చెప్పిందంతా యదార్థంకింద కనిపిస్తుందేమో."

"అయితే కావచ్చును."

"మరి స్త్రీ యంత్రం అనేమాటకి మీ సంజాయిషీ ఏమిటండోయి మాష్టరుగారూ."

స్త్రీ ఎప్పుడూ యంత్రమే. సృష్టి అంతా స్త్రీలోనే వుంది. సృష్టి ఉత్పన్నానికి కారకురాలు. పాట్లుపడి, మోసి పెంచి పెద్దవాళ్ళనిచేస్తూ యీపని అంతా యంత్రంలా చేస్తుంది. యీ యంత్రం భగవంతుడు చేసిపెట్టిందే. ఇది ప్రకృతి సిద్ధమయిన యంత్రం.

"స్త్రీ యంత్రం కాకపోతే మరి బానిస అంటారా. ఏమిటోనండి ... ఈ మధ్య యిల్లాగ చాలా మంది మేము బానిసలమని, యంత్రాలమని తెగరాసిపారేస్తూంటే మాకు "ఇదేమిట్రా మన నిజస్థితి యిల్లాగుందా" అని గుండెలు బెంగపెట్టుకున్నాయి. నెమ్మదిమీద ఆలోచిస్తే మీరు చెప్పినదాన్నిబట్టి అంతా యదార్థం అని తోస్తోంది. అయితే స్త్రీని గురించి మీపరిపూర్ణ అభిప్రాయం ఏమిటో చెప్పండి"

"సుఖమయమయిన సంసార సాగరాన్ని ఈదేందుకు, మగనితోకూడా కష్టసుఖాల్ని భరించి తానుకూ గలనని పూచీపడ్డ ఒక వాటాదారు. చంచలచిత్తుడయిన భర్త మనస్సును క్రీగంటి చూపుతో కట్టివేయ గలిగిన ఒక మహామేధావి. కాని నిర్మలమయిన మనస్సు కానందున అనుమానమనే పెనుగాలికి ఊగుతూ తన జీవితరంగంలో ఎప్పుడూ ఏదో తుఫాను చెలరేగిస్తుంటుంది. ఎక్కడేను ఒకకలత పుట్టింది అంటే అది ఆడదానివల్లే పుడ్తుంది. చాలావరకు స్త్రీని నీచంగా పరిగణించే మగవారు రానురాను తగ్గిపోతున్నారు. కులటలను ఎప్పుడూ నిందిస్తారు. పతివ్రతలను ఎప్పుడూ ఉంచి మంచిమాట."





జండుబాలామృతము

క్షీణించి అనారోగ్యవంతులుగా నుండు బిడ్డలకిది యమృతమువంటిది. వారికి ఆకలిని వృద్ధిపరచి ఆరోగ్యము నిచ్చును.

పిల్లలకు దంతములు మొలుచునప్పుడు కలుగు నొప్పులను పోగొట్టును. కాళ్లు చేతులు శుష్కించి కడుపు పెద్దదిగా నున్న బిడ్డలకిది దివ్యౌషధము. జీర్ణించిన జలుబు, దగ్గు మొదలగు వాటినికూడ నివారించును.

బుడ్డి ఒకటికి రూ. **1-2-0.**

రాజా అండుకో., సంద్యాల.
దుర్గా మెడికల్ ష్టోర్సు, కావలి
రాఘు మెడికల్ ష్టోర్సు, పాలకొల్లు
రాధాకృష్ణా మెడికల్ ష్టోరు, నరసపూరు

పి. సీతారామయ్య, పలమంచిలి
కుసుమంచి అప్పలరాజు, అనకాపల్లి
సీలం & కో., విశాఖపట్టణం.
దుర్గ & సన్సు, కర్నూలు.